# శారద

నాగల్లి హనుమంతరావు

"ఆ...అదిగో...ఆ అమ్మాయే, మధూ!" పచ్చగడ్డిమీద మేనువాల్చి పైన కన్పిస్తున్న నక్షత్రాలని లెక్కపెడుతున్న మధు ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు.

..."అదిగో...ఆ ముగ్గురూ లేరూ?... వారిలో కుడిపక్క పిల్లే మా శారద..."

మగతగా నిద్రపట్టడంచేత కొద్దిగా మూతలుపడిన కళ్లను రెండు చేతులతోను నులుముకుని ఆవైపుగా చూచాడు మధు... మంచినీళ్ళబావి...బిందెలతో ముగ్గురు అమ్మాయిలు...కుడిపక్కగానున్న అమ్మాయికేసి దృష్టి మరలించాడు...పక్కనున్న పిల్లలతో కిలకిలా నవ్వుతూ మాట్లాడుతోంది...ఏం సరసం జరుపుకుంటున్నారో, ఒకరిమీదొకరు నీళ్లు జల్లుకొంటున్నారు ... మధు ఆమెకేసి తదేకంగా చూశాడు ... మేలిమి బంగారు చాయ ... మన్మథపాటి రొమ్ము... కోలమొహం...ఎంతో అమాయకంగా కనిపించిందతనికి...ఎంతో నిరాడంబరంగా ఉంది ... వయస్సు పదిహేడు, పద్దెనిమిది సంవత్సరాల ప్రాంతం...తనివితీరా చూచేలోపలే వాళ్లు ముగ్గురూ బిందెలలో నీరు నింపుకుని వెళ్లిపోయారు...

..."ఏం, సరిగ్గా చూశావా?"

మధు, తాను తదేకంగా అటువైపే చూడటంతో మూర్తి ఏమనుకున్నాడో అని, సిగ్గుపడి తలదించేసుకున్నాడు.

..."ఏం, నచ్చినట్లేనా?" మూర్తి అడిగాడు.

మధుకి కొట్లోంచి మాట రావటంలేదు. మెల్లిగా అన్నాడు, "అసలు ఆ అమ్మాయిని చూడటానికి నేనర్హుణ్ణా? ఎంత అందంగా ఉంది!"

మూర్తి ఒక్క క్షణం శ్వాస పీల్చుకుని మొదలెట్టాడు: "నేనెంతో ఆలోచించే నిన్ను చూడమన్నాను, మధూ! మా చెల్లాయిని సుఖపెట్టగలవాడు నీవు తప్ప వేరొకడు లేడు అన్న భావం నాలో నాటుకుపోయింది. శారద అందానికీ, గుణాలకీ నీవే తగినవాడివని నా అంతరాత్మ ప్రబోధిస్తూవచ్చింది. అందుకనే నిన్ను వచ్చి చూడమన్నాను. నీవు సరేనంటే..."

మధుకి ఒళ్లు పులకరించింది. "అటువంటి అప్సరస నాకు భార్య అవుతూంటే,—తనకేమీ అభ్యంతరం లేకపోతే—, అది నా అదృష్టం కాదా, మూర్తీ?" అన్నాడు మెల్లిగా.

మూర్తి చాలా ఆనందపడ్డాడు. "నాకు చాలా సంతోషంగా ఉంది, మధూ! ఇంటికి వెళ్లి నాన్నతో చెప్దాం, పద!" అంటూ లేచాడు.

మధుసూదనరావు, సీతారామమూర్తి బి. ఏ. లో క్లాసుమేట్సు. మూర్తి కొద్దిగా పొట్టిగా, లావుగావుంటాడు. పచ్చనిరంగు. ఎక్కువగా అందరితోను కలిసే స్వభావం కాదతనిది. బి. ఏ. చదివినంతకాలం మధు ఒక్కడితోనే సాన్నిహిత్యం ఏర్పడింది. మధు పొడుగ్గావుంటాడు. ఎత్తుకుతగినలావు; చామనచాయ. సంగీతం అంటే చెవికోసుకుంటాడు. కాని స్వతహాగా మాత్రం ఏమీ పాడలేడు. అందుకనే కామోసు "విని ఆనందించటంలో ఉన్న సంతృప్తి పాడడంలోకూడ ఉండదేమో" అని అంటూ వుంటాడు. మూర్తీ, మధులిద్దరు ప్రాణమిత్రులు. తనువులు వేరైనా అభిరుచులొకటే. బి. ఏ. పూర్తి చేసినతరువాత మూర్తి పైచదువు మానేసి ఊళ్ళో తండ్రికి సహాయంగా ఉంటూ వచ్చాడు. మధు ఆపైన ఎం. ఏ. పూర్తిచేసి, వైజాగ్‌లో ఒక సంవత్సరంనుంచీ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. మూర్తికి చిన్నతనంలోనే వివాహం జరిగింది. మధు ఇంకా అవివాహితుడే. ... ఒకవారంరోజుల క్రిందటే (చాలా రోజులతరువాత) మూర్తి వద్దనుంచి, మధుకి ఒక ఉత్తరం వచ్చింది. "నీకొక సంబంధం ఉంది. తప్పక రావలసింది" అని...మధు మూర్తి ఊరికి వచ్చాడు. వచ్చినతరువాత చెప్పాడు మూర్తి మధు చూడబోయేది తనచెల్లెలినే అని.

"అయితే యిక చూపటం ఎందుకు?" అన్నాడు మధు. కాని మూర్తి మధుని ఒప్పించి శారదని చూపించాడు. శారదకి తెలియకుండానే, తన అంగీకారాన్ని తెలుపుతూ ఆ మర్నాడే మధు వైజాగ్‌కి తిరిగి వెళ్ళిపోయాడు.

• • •



నెల తిరిగేలోగానే శారదా మధూల వివాహం జరిగింది. వివాహమయి అనాటికి మూడోరోజు. ఆరోజురాత్రే ఆతని శోభనం. రాత్రి ఎనిమిదిగంటలయింది. అతడిమనసులో విచిత్రమైన ఊహలెన్నెన్నో వచ్చి అతణ్ణి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

"నిజంగా తానెంత అదృష్టవంతుడు! తనూ, శారదా ప్రక్క ప్రక్కనే నుంచుని ఫోటోలు తీయించుకుంటున్నప్పుడు 'రాధా మాధవు'ల్లా ఉన్నారన్న మామ్మమాట జ్ఞాపకం వచ్చింది.

అవును తన జీవితాన్నే సార్థకం చేయగల భార్యవచ్చినప్పుడు ఎందుకుండరు?.."ఒరేయ్ నాకు కావలసింది. 'అందం' కాదు అంటూనే 'అప్సరస' నే కట్టేసుకున్నా వేమిటిరోయ్?" అన్న సుధాకర్ మాటలు జ్ఞాపక మొచ్చాయి. తనలోతానే నవ్వుకున్నాడు. ఇంక తనకేం కావాలి? తనూ, శారదా ప్రవశంలో ఈ ప్రపంచాన్నే మరచిపోరూ?' ...మూర్తి వచ్చాడు ఇంతలో ... మధు చేతుల్ని తనచేతుల్లోకి తీసుకుంటూ, మూర్తి అన్నాడు.

"మధూ! ఇక నీచేతుల్లో పెట్టాం మా శారదని! ఎల్లా చూసుకుంటావో...నీకూ శారదలాంటి వొక చెల్లెలుంటే తెలిసొచ్చేదనుకుంటాను మా బాధ".....మూర్తి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి ... మూర్తిబాధని అర్థం చేసుకొన్నాడేమో! మధు మెల్లిగా అన్నాడు:

"నేనేమన్నా రాక్షసుణ్ణనుకున్నావా, చెప్పు మూర్తీ?...శారదని పువ్వుల్లో పెట్టుకొని పూజిస్తాను...నా హృదయ పీఠంలో నిలుపుకుంటాను. చాలా"... మూర్తి కళ్ళొత్తుకుంటుకొని, "ఈ రోజు మీ మొదటిరాత్రికదూ? మీరు ఇవాళ పొందుతున్న పవిత్రమైన అనుభూతుల్నే మీ దాంపత్యజీవితంలో ప్రతీరోజూ పొందాలని నేను భగవంతుణ్ణి మనసారా ప్రార్థిస్తున్నాను." అంటూ వెళ్లపోయాడు.

...మూర్తి వెళ్ళినతరువాత సుధాకర్ వచ్చాడు. ఎప్పుడూ నవ్వించే స్వభావమితనిది. మూర్తిలాగానే సుధాకర్ కి కూడా చిన్నప్పుడే పెళ్ళయింది. అయితే భార్య గయ్యాళి. పైగా ఇతను చెప్పిందల్లా చేయక పోవటమే ఆమెపని. సుధాకర్ మధుతో అన్నాడు :-


"చూడు, మధూ! నీకన్న ముందు పెళ్లి చేసుకొని సంసారంచేస్తున్న అనుభవంతో ఒక్క విషయం చెబుతాను విను. నీవు గది మూయగానే, నీభార్య లోపలికి రాగానే, చాచి, గూబ అదిరిపోయేలా, లెంపకాయ కొట్టేసి, వెంటనే దగ్గరికి తీసుకో. ఇకఛస్తే నీమాటకు ఎదురుచెప్పదు ... భయమంటూ వుంటుంది. లేకపోయిందా? నాలాగే నివు తయారవుతావు..." మధుకి నవ్వాగలేదు. "సరే! ప్రయత్నిస్తాను" అన్నాడు. ఒరేయ్! నిజంగా అంతపనీ చేస్తావేమిటి? జాగ్రత్త.. మీ ఆవిడ ఆజన్మాంతం నన్ను తిట్టుకుంటుంది." అంటూ నవ్వుతూ వెళ్లిపోయాడు.

మధుని చక్కగా అలంకరించిన పడక గదిలోనికి తీసుకువెళ్లేరు. అప్పటికే పదకొండున్నర అయింది...అతనికి మనస్సు ఉండవలసిన స్థానంలో లేదు...ఏవేవో ఊహాలు స్ఫురిస్తున్నాయి ... ఒంటరితనం భరించడం కష్టంగాతోచింది...పన్నెండుకి పదినిముషా లుందనగా. శారదని లోపలికి పంపి, బయట గొళ్ళెం వేసేసింది మూర్తి భార్య...

సాభిప్రాయంగా తలుపువైపు చూశాడు మధు. అక్కడ శారద నిలబడివుంది. ఒక్క నిమిషం నిశ్శబ్దం...మెల్లగా నవ్వుకుంటూ లేచి వెళ్లి లోపలనుండి గొళ్లెం వేశాడు. శారద ప్రక్కనే వెళ్లి నుంచున్నాడు... ఆమె తల వంచుకొని వుంది. చూపుడువ్రేలితో ఆమె చిబుకాన్ని పట్టుకొని ముఖం పైకెత్తాడు. "చూడు శారదా! ఇంకా సిగ్గుపడతావెందుకు నన్ను చూసి. మనము త్రెంపలేని తాళ్లతో మనని పవిత్ర బంధనం చేశారు మన పెద్ద వాళ్లు!"

...శారద మధుకేసి చూసింది...అతను వ్యక్తపరచే భావాలలో నిజమెంతో పరీక్షిస్తున్నదేమో! నిర్మలంగా, ఈషణ్మాత్రం కల్మషంలేని అతనిముఖాన్ని పరికించి చూసింది..."ఏమిటి, శారదా, అలా చూస్తున్నావు? నేనేం రాక్షసుడిలా కనిపించటం లేదుకదా?" నవ్వుతూ అడిగాడు మధు. ఇంకొకసారి తలయెత్తి, అతని ముఖాన్ని చూసింది...అంతే...వెంటనే కాళ్లమీద పడిపోయింది. మధుహృదయం ద్రవించిపోయింది. "ఎందుకింకా భయం, శారదా! నిన్ను నా ప్రాణంకన్నా అధికంగా చూసుకుంటా...చాలా?...ఇక లే"...శారద లేవలేదు; మధు కాళ్లమీదే ఉంది. మధు తిరిగి అన్నాడు: "పిచ్చిపిల్లా! నిన్ను నాహృదయ పీఠంలో నిలుపుకుంటానన్నానుగా? ఇంకా నమ్మకం కుదరలేదా నామీద?" అని. శారద ఇంకా లేవలేదు. మధుకి కొంచెం ఆశ్చర్యం వేసింది.

"ఏమిటి శారదా? నన్ను పరీక్షిస్తున్నావా? లేక నాతో పరిహాసమాడుతున్నావా? అయితే నేనే పడుకోబెడతాలే" అంటూ క్రిందికివంగి, రెండుచేతులతోను ఆమెని మృదువుగా ఎత్తుకొని నడచివెళ్లి, మంచంమీద పడుకోబెట్టాడు. శారద గిలగిలా తన్నుకోవడం మొదలెట్టింది...మధుకేమీ తోచలేదు. గాభరాపడిపోయాడు. "అల్లావున్నావేం శారదా? నన్ను చూసి అంతగా భయపడవలసిన పనేముంది? నేను..." అతనికి మాటలు రాలేదు. శారద



తన్నుకోవడం ఎక్కువయింది. అప్పటికి గాని శారదకి వచ్చింది 'మూర్ఛ' అని తెలియలేదు. నిలువునా నిర్విణ్ణుడైపోయాడు మధు.

"ఈ శుభసమయంలో ఏమిటీ విపరీత్యం శారదా?" అంటూ నిల్చుండిపోయాడు. శారద ఇటూ, అటూ కదిలిపోతోంది. మధు తలుపుకొట్టాడు. ఇటువంటి సమయాల్లో ఎవరూ, ఏపరిస్థితిలోనైనా తలుపుతీయరు తెల్లవారేదాకా. ఇక్కడా అంతే జరిగింది. శారద నోట్లో మంచినీళ్లుపోశాడు మధు. ప్రక్కకిపడిపోకుండా తానూ ప్రక్కనే కూర్చున్నాడు. పదినిమిషాలు గడిచాయి. శారదకేమీ తగ్గలేదు. పైగా తన్నుకోవడం మరీ ఎక్కువయింది. మధు ఇంక ఉండబట్టలేకపోయాడు. బలంగా తలుపుకొట్టాడు. గొళ్ళెంతీసి తలుపు తెరిచింది మూర్తి భార్య... "ఓ. అన్నయ్యగారా?...శారదేమో అనుకున్నాను...ఏమిటో అంత అవసరం?" అంటూ నవ్వింది. ఆత్రుతగా మధు, 'ఏమిటో నండీ! శారదకి మూర్ఛవచ్చినట్లుంది. గిలా గిలా తన్నుకు.."

పూర్తిగా వినకుండానే, 'ఆ' అంటూ ఆమె పరుగెత్తుకొని వెళ్ళి మూర్తితల్లినీ, తండ్రినీ లేపుకొని వచ్చింది. వారు శారద నోట్లో ఏదో మాత్రవేశారు. శారద తన్నుకోవడం కాస్త తగ్గింది.

"నీవు కొంచం పక్కగదిలోకి వెళ్ళి కూర్చో నాయనా! శారదకేమీ భయం లేదు. ఇది మామూలేగా!" అంటూ మూర్తి తండ్రి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. మధుకి పంచప్రాణాలు ఎగిరిపోయాయి. ఆయన ఆఖరి మాటతో!...'మామూలు'...ఏమిటి మామూలు? శారదకి ఫిట్స్ రావడం మామూలేనా? అయితే మూర్తి తనతో ఈ విషయం ఎందుకు చెప్పలేదు? తాను వైవాహిక జీవితంమీద పెట్టుకున్న ఆశలన్నీ అడుగంటి వల్లేనా? ఏం, ఆ మాత్రం చెప్పలేకపోయాడా మూర్తి? తన జీవితం నాశనం చెయ్యటం ఎందుకు? ...బుర్ర వేడెక్కిపోయింది... ఏమీ తోచటంలేదు. సుధాకర్ పక్కనపోయి పడుకున్నాడు...

"ఏరా! నిజంగా నేనుచెప్పిన పనంతా చేసేవేమిటి?...లేకపోతే, ఏమిటీ విపరీతం?"... సుధాకర్ మాటలు శూలాల్లా గుచ్చుకుంటున్నాయి. కళ్ళు మూసుకొని నిద్రపోవటానికి ప్రయత్నించాడు. కాని నిద్ర పట్టలేదు... ఎటు చూచినా శారద రూపమే కనబడుతోంది...నవ్వుతూ తనను పిలుస్తున్నట్లు, తాను పరుగున ఆమెను చేరినట్లు, ఆమె వెంటనే క్రింద పడిపోయినట్లు, పీడకలలు — అంధకారబంధురమైంది తన జీవితం- ఇక అక్కడ తను ఉండిమాత్రం చేయగలిగిన దేముంది?...మధు లేచి నిల్చున్నాడు. ఆ గదిలో కనపడిన తన సామాన్లన్నింటినీ హోల్డాల్‌లో కట్టివేశాడు...

# శారద

ఇంట్లో అందరూ నిద్రలో ఉన్నారు...ఎవరికీ మెలకువకలుగనీయనంత మెల్లగా తలుపు తీసి, స్టేషన్‌కి చేరుకున్నాడు.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు...ఒక అరగంటలోపలే రైలెక్కి, శారదాసమక్షంలో సంతోషంగా ఉందామనుకున్న మధు, ఆమెకి దూరమైపోయాడు.

* * *

మధు వెళ్ళిపోయి పదిరోజు లయింది. మూర్తి తోటలో ఒక్కడూ కూర్చుని ఉన్నాడు. అతని చేతిలో మధు వ్రాసిన ఉత్తరం ఒకటి ఉంది. అందులోని కొన్ని వాక్యాలు అతను ఎంత వద్దనుకొన్నా జ్ఞాపకమొస్తూ, అతణ్ణి అమితంగా బాధపెడుతున్నాయి...

...'కొద్దిపాటి మంచితనంతో, ఆశయాలతో, జీవించ ప్రయత్నిస్తే 'అనుభవాలకి హద్దులు ఉంటాయి' అనుకొన్న అభిప్రాయం తప్పని తెలిసింది'...

...'ప్రాణ మిత్రుడివి కదా అని సర్వం నీ చేతిలో పెడితే, ప్రాణమే తీసుకొంటావా'

...'నాభావి జీవితానికి శారద వింత మెరుగులు దిద్దుతుందని చెప్పావు...నమ్మాను... మోసపోయానని తెలుసుకొనేవరకే పరిస్థితులు చెయ్యిదాటిపోయాయి.

ఆఖరి వాక్యమే అతనికి కొద్దిగా ఉపశమన మిచ్చింది...

సబ్-ఎడిటర్: [ఎడిటరుతో] సార్! మన పత్రికలో మూడవ పేజీలో నాలుగు లైన్లు ఖాళీగా ఉన్నాయిసార్.

ఎడిటర్: అదిగూడ అడగాలటయ్యా! ఏదో ఒకటివేయ్. ఆఁ...విశాఖపట్టణంలో విమాన ప్రమాదమని వెయ్‌పోఁ...

సబ్-ఎడిటర్: [మరికొంత సేపటికి తిరిగివచ్చి] ఏడవ పేజీలో 2 లైన్లు ఖాళీగా ఉన్నాయి సార్!

ఎడిటర్: అబ్బబ్బ! అన్నీ చెప్పాలా..."3 వ పేజీలో వేసిన విమాన ప్రమాదం పొరబాటు"ని వెయ్‌పోఁ... 'బాల్యమిత్రులు'

...'శారద నీ చెల్లెలే కావచ్చు. కాని ఇప్పుడామె నా భార్య! నీవు చేసిన తప్పులకు వేరొకరి జీవితం నాశనం కావటం నాకిష్టంలేదు. శారదని త్వరగా పంపించవలసింది'

అప్రయత్నంగా మూర్తి కళ్లవెంట రెండు బిందువులు రాలి ఉత్తరం మీద పడ్డాయి... బరువైన హృదయంతో అతనింటికి మరలాడు.


* * *

ఏమయితేనేం; తనను తాను సంబాళించుకొని, కాపురం పెట్టాడు మధు. మొదటి రోజునే సహృదయంతో శారదతో చెప్పాడు: "నీవు నావలన భయపడి మూర్ఛలు తెచ్చుకోవలసిన కారణమేమి నాకు కనపడటంలేదు. నేనూ మనిషినే...నాకూ హృదయంవుంది...నీబాధని తెలుసుకొన్నాను. నీకేలోటూ రాకుండా చూసుకుంటూ ఆనందంగా గడపాలనే నా కోరిక కూడా. ప్రతి చిన్న విషయానికీ బాధపడకుండా చూసుకో... అంతకన్నా నేను వేరే చెప్పవలసిందేమీ లేదు" అతనిమాటలు శారద హృదయాన్ని హత్తుకున్నాయి...అంతే...ఆ నాలుగు రోజులూ చాలా ఆనందంగా గడిచాయి. అయిదవ రోజున శారదవెంట వచ్చిన అన్నపూర్ణమ్మగారు వెళ్ళిపోయారు. ఆమె వెళ్ళిపోగానే శారద వంటచేయటం మొదలెట్టింది. ఆమె చేసిన వంటల్ని ఎంతో మెచ్చుకుంటూ భోజనం చేసి, కాలేజీకి వెళ్లాడు మధు ఎంతో సంతోషంగా.

ఇంటికి వచ్చేసరికి అయిదయింది. సరిగ్గా అప్పటికే జడవేసుకోవడం పూర్తిఅయింది శారదకి. దువ్వెనలోంచి చిక్కుతీస్తోంది. మధు వస్తూనే అన్నాడు, "శారదా, నీవు పోయి తొందరగా ముఖంకడుక్కొనిరా... ఇవాళ సినిమాకివెళ్దాం" అని...శారద తల వంచుకొనే, మెల్లిగా అంది. "నేనురానండి! ఆసినిమాలో ఏమన్నా హృదయాన్ని బాధించే సన్నివేశాలుంటే మళ్ళీ పడిపోవలసివస్తుంది. అంతమందిలో బాగుండదు" అని. మధు సంతోషం ఒక్కసారిగా కరిగిపోయింది. "నిజమే! నాకాఊహ తట్టనేలేదు", నిరాశాజనకంగా ఉన్నాయి ఆ మాటలు—కోటు విప్పి హేంగర్‌కి తగిలిస్తూంటే జేబులో ఏదో ఎత్తుగా తగిలింది. అప్పుడు జ్ఞాపకం వచ్చినట్లుంది నవ్వుతూ అన్నాడు: "శారదా, నీకోసం ఏం తెచ్చానో చెప్పుకో ఇవాళ?" అని..."ఏమిటండీ అది ...చెప్పరూ?" ఆత్రుతతో అంది శారద. "అయితే నువ్వువెళ్ళి త్వరగా ముఖం కడుక్కొని రా! అప్పుడు చెప్తాను" అన్నాడు. శారద బాత్ రూంలోకి వెళ్లిపోయింది. మధు బట్టలు మార్చుకున్నాడు. ఈలోపల. శారద ముఖం తుడుచుకొనివచ్చి మధుప్రక్కన నిలబడింది. ఎంతో ప్రశాంతంగా, అందంగా

కనబడింది శారద మధుకళ్ళకి. అలాగే చూస్తూ కూర్చున్నాడు ఆమెకేసి. "ఏమిటండీ అలా చూస్తున్నారు? నేనేమన్నా వింతగా కన్పిస్తున్నానా?" ఎంతో అమాయకంగా ఉంది ఆ ప్రశ్న... 'ఎంత ముద్దుగావున్నావు శారదా!' ఇంకా చూస్తూనే అన్నాడు. 'ఆ ఊరుకోండురూ!' అంటూ శారద మాట మార్చింది. "ఇంతకీ ఆ తెచ్చిన దేమిటో చెప్పనేలేదు!"...మధుకి అప్పుడు జ్ఞాపకం వచ్చింది. అవును మర్చిపోయాను...నువ్వు కళ్ళు మూసుకోవాలి, మరి" అంటూ లేచాడు.

శారద కళ్ళు మూసుకొంది. ఆమె ప్రక్కగా చేరాడు మధు. "ఇదిగో, నువ్వు గట్టిగా శ్వాసపీల్చు" అంటూ ఆమెజడలో తను తెచ్చిన మల్లెపూలదండ కూర్చి, జడ ముందుకు వేశాడు. ఆమె ఏమిటోననుకుని గబగబా శ్వాసపీల్చింది. వెంటనే క్రిందపడి పోయింది. "ఏమిటిశారదా, మళ్లీ ఏమొచ్చిందని పడిపోయావ్!" మధు గాబరాతో అన్నాడు. శారద మాట్లాడలేదు. తన్నుకోవటం మొదలెట్టింది. మళ్ళీమూర్ఛవచ్చింది. మధు ఆమెని మంచంమీద పడుకోబెట్టాడు. అలమారులో నున్న సీసాలోంచి ఒకమాత్ర తీసి ఆమె నోటిలో వేశాడు. శారద తన్నుకోవటం మెల్లి మెల్లిగా తగ్గింది. అయిదు నిమిషాల్లోనే ఆమెకి స్పృహ వచ్చింది. ప్రక్కనే కూర్చుని పరిచర్యలు చేశాడు మధు. అరగంటలో కళ్ళు తెరిచింది శారద. మధుసైపు చూసింది. "ఏమిటి, శారదా! మళ్ళీ పడిపోయావేం?" ఎంతో జాలిగావుంది ఆ ప్రశ్న. తల క్రిందికి దించుకుంటూ అంది శారద, "...నేను హోమియోపతీ మందు తీసుకుంటున్నాను కదండీ? ఈ వైద్యానికీ, కాఫీలూ, సువాసన పదార్థాలూ మొదలైనవాటికీ సాత్తు కుదరదు. వాటివల్ల రోగం ఎదురు తిరుగుతుంది. మీ రేమో మల్లెపూలు ముడిచారు. మరి!"... మధుతల తిరిగిపోయింది. "సరే! నువ్వు పడుకొని విశ్రాంతి తీసుకో కొంతసేపు" అంటూ తను పడగదిలోకి వెళ్ళిపోయాడు. పడక కుర్చీలో కూర్చొని ఆలోచనాసాగరంలో మునిగిపోయాడు..."ఏ విసంగా తయారైంది తన జీవితం! భార్య చక్కగా పూలు ముడుచుకొని ఎదుట నిలబడితే చూడలేడు; కలిసి ఒక్క సినిమా చూడలేడు. తను..." అలాగే నిద్రపోయాడు. రాత్రి ఎనిమిది గంటలకి నిద్రలేపింది శారద. "ఎలా వుంది నీకు శారదా?" అని అడిగాడు..."నాకేం? బాగానే ఉన్నానండీ...ఏదో ఓ గంట ఉంటుందంతే...ఆ తరువాత మామూలు మనిషినే." అంది శారద. 'ప్రశాంతతకోసం మనుష్యులందరూ వాహ్యాళికి వెళ్ళే సాయంకాల సమయంలోకూడా తాము ఇల్లు వదిలి వెళ్ళలేక పోయామే' అన్న భావం మనస్సులో మెరుస్తూండగా, బరువుగా నిట్టూర్చి, భోజనానికి లేచాడు మధు.



"అరే ఎవరూ చూట్టలేదే"

—వి. జి. కృష్ణమూర్తి.

* * *

పని హేనుగోజులు గడిచాయి.

చిన్న చిన్న విషయాలకే బాధపడే శారద హృదయం గాయపర్చకుండా ఉండాలని మధు సకలప్రయత్నాలు చేసేవాడు. ఆకస్మికంగా వచ్చే ఆమె మూర్ఛలవల్ల అతనికి ఎన్నో నష్టాలు వాటిల్లుతూండేవి...ఒక రోజున తాను పాతికరూపాయలు ఖర్చు చేసికొన్న 'టీ సెట్టు' తుడుస్తుండగా, మూర్ఛవచ్చి పడిపోయింది శారద... సెట్టంతా విరిగిపోయింది. అయినా శారద ఎక్కడ బాధపడుతుందో అని అతను ఆమెని ఏమీఅనలేదు...ఇది జరిగిన మూడురోజులకే వేరొక అనర్థం జరిగింది. దాసీమనిషి రాని కారణంచేత ఆ రోజు శారదే ఇల్లు ఊడుస్తోంది. గాజుబీరువాని పక్కకి నెట్టి, ఊడుస్తుండగా మూర్ఛ వచ్చేసింది...ప్లటుతప్పి, గాజుబీరువా బోరగిలా పడిపోయింది. శారదకి స్పృహవచ్చినతరువాత చూస్తే బీరువా గాజు పూర్తిగా విరిగిపోయింది...అందులో ఎంతో ప్రేమతో మధు దాచుకుంటున్న గాజుసామానులు, గ్రామఫోను రికార్డులు కూడా తునాతునకలైపోయాయి...అప్పుడే కాలేజీనుంచి తిరిగివచ్చిన మధు ఇదిచూచి స్తంభించిపోయాడు... ఆ సన్నివేశంలో కూడా గొప్ప ఆత్మనిగ్రహం చూపించాడు మధు. తనకెంత బాధకలిగినా, శారదపై మాత్రం నోరు జారలేదు...బహుశః ఈ విషయం పూర్తిగా మరిచిపోయేవాడేమో కూడా...కాని...ఆ రోజు తిరిగి తిరిగి వచ్చి పడుకున్నాడు. భోజనము కూడా సరిగ్గా చేయలేదు. రాత్రి నిశ్శబ్దముగా ఉంది. పగిలిపోయిన బొమ్మల ముక్కలన్నీ వెయ్యి కంఠాలతో అరుస్తున్నట్టు భ్రాంతి కలిగింది. మనస్సుకి శాంతి కలగటం లేదు. ఏదో చెప్పలేని బలహీనత తన్ను లొంగదీసుకుంది. గ్రామఫోన్ రికార్డు ముక్కలు వెక్కిరించినట్టున్నాయి. ఇంతకాలంనుంచీ అణుచుకుంటున్న హృదయ భారం ఒక్కసారిగా పెల్లుబికింది...ఇక ఏం చెప్పాలి?......

ఆ మర్నాటినుండీ మధు తనను తాను సంబాళించుకోలేక పోయాడు. శారదమీద విసుగూ, కోపం ప్రారంభమయ్యాయి. ఇంట్లో శాంతి, సుఖమూ దూరమైపోయాయి. ప్రతి చిన్నవిషయానికీ శారదని కసురుకోవటం మొదలెట్టాడు. శారద మధులో కలిగిన మార్పుని చూచి భయపడిపోయింది... అయినప్పటికీ మధుతో ఎంతో శాంతంగా, అణకువగా ప్రవర్తించేది......ఆరోజున మధు ఇంటికి వచ్చేసరికి ఎనిమిది దాటింది. అతను విసుగ్గా కూర్చుని బూట్లు విప్పుకొంటున్నాడు. "క్లబ్బుకి వెళ్ళారేమిటండీ; ఇవాళ?" ......ఇంకా పూర్తికాకముందే మధు రెచ్చిపోయాడు, "ఏం? అక్కడన్నా శాంతంగా కూర్చోకూడదా? నేనొక్క క్షణం సుఖంగా ఉండటం నీకిష్టం లేదు"......శారద నిశ్చేష్టురాలైపోయింది ఈ మాటతో...... 'మిమ్మల్ని వెళ్ళొద్దని నేను అన్నానా చెప్పండీ?' అని మెల్లిగా అంది. కాని మధు ఆమెని అర్థంచేసుకొనే పరిస్థితిలో లేడు. "ఎందుకు మాటలు మారుస్తావు? నేను సుఖంగా ఉండటం నీకిష్టం లేదని స్పష్టంగా చెప్పెయ్యకూడదూ?" అని నిరాగా అన్నాడు. శారదకి కళ్ళు నీళ్ళు తిరిగాయి ఈ మాటలతో. "నేను కొన్న ముహూర్తమెటువంటిదో! ఎప్పుడూ ఏడుపులేకదా ఇంట్లో" అంటూ లోపలికి

వెళ్ళాడు......శారద మళ్ళీ పడిపోయింది. ఆమెని మంచంమీద పడుకోబెట్టి తానే భోజనం పెట్టుకొని, నిద్రపోకుండా ఆలోచిస్తూ మధు.

బరువెక్కిన కళ్ళతో మర్నాడు నిద్ర లేచాడు మధు. కాఫీ తాగి, ఏవో పేపర్లు దిద్దుకుంటూ కూర్చున్నాడు. శారద వచ్చి అల్లుతోంది......... "టైమెంత?" మధు అడిగాడు. రేడియో పెట్టూ, "చాలా పొద్దు పోయింది లెండి! ఇక స్నానానికి లేవచ్చు" అంది శారద సరసంగా...... "ఏమిటీ తుంటరి సమాధానాలు? ఎంతయిందో సరిగ్గా చెప్పలేవూ?" చాలా విసుగ్గా అన్నాడు మధు... శారదముఖం చిన్నబోయింది ... "ఎందుకండీ, అల్లా కసురుకుంటారు? సరైన టైము తెలుసుకోవటానికి రేడియో పెట్టాను. గడియారం మున్న నే..." మధు కోపంతో అంటున్నాడు: "విరక్తి కట్టావు కదూ? చాలా మంచిపని చేశావు. ప్రతీ విషయానికీ 'నేనూ ఉన్నానంటూ' బయలుదేరడం, నాశనం చెయ్యడం! ఆ పన్లన్నీ నేనే చేసుకోనీ వాణ్ణిగా! ఇంట్లో ఒక్క క్షణం సుఖం, శాంతీ లేదుకదా! ఇటువంటి వాళ్ళసలు పెళ్ళి చేసుకోవటమెందుకు? ...అవున్లే... లేకపోతే నాలాంటివాళ్ళని చంపడం, ఎలా?" ఆ వేశంలో అనేశాడు... శారద నీమాటలు గాయపరిచాయి, తల తిరిగి పోయింది; కళ్ళు తుడుచుకొంటూ అంది: "ఎందుకండీ, అలా అంటారు? నాకీ జబ్బు ఉందని అన్నయ్య మొదటనే మీకు చెప్ప లేదు?" మూర్తి ప్రసక్తి వచ్చేసరికి పిచ్చికోపం వచ్చింది మధుకి. మరీ రెచ్చిపోయాడు... "ఓ అన్నయ్య కేం? చెప్తాడు...ఛీ! వాడు పురుషుడు, వదిల్చుకుందా అని ఇంత ద్రోహం చేస్తాడా? ...అతడూ ఒక మనిషేనా?"..శారదకి ఏడుపాగలేదు; సరిగ్గా నిలుచోలేక పోయింది. కళ్ళు తిరగడం మొదలెట్టాయి. మధు ఆగలేదు. "అతడికి బుద్ధిలేకపోతే నీకన్నా లేకపోయిందా, చెప్పమన డానికి?...నన్నసలు బాధించటానికేగా నువ్వు గంప ఎక్కింది? ఇప్పుడైనా నీకు సుఖంగా ఉందా?"... మళ్ళీ శారద పడిపోయింది. ఈసారి మధుకి భయం కలుగలేదు. పైగా కోపం మరీ ఎక్కువయింది..."ఇంకేం పనుంది? ఏమన్నా అంటే పత్రాగ్రహం! మంచి ఆయుధం సంపాదించుకున్నావులే!..." శారద తెప్పరిల్లి కోవటం మొదలెట్టింది. ఎంత కోపంతో ఉన్నా మధుకి ఆమెని మంచంమీద పడుకో బెట్టక తప్పలేదు. దాసీమనిషితో శారదని చూడమని చెప్పి తాను కాలేజీకి వెళ్ళిపోయాడు.

నాలుగింటికి అతని ఆఖరి పీరియడ్ అయిపోయింది. ఇంటికిపోవడానికి మన స్కరించలేదు. బీచికి పోయి కూర్చున్నాడు.

# శారద

అతనికి శారదే జ్ఞాపకం వస్తోంది. "తను వివాహం చేసుకొన్నది ఈ విధంగా పరితపించ డానికేనా? తన బ్రతుకులో పరిమళమే పోయింది...శారద ఉండిమాత్రం తనకేం లాభం?...అతనికి మధ్యాహ్నమే తను క్లాసులో ఇచ్చిన లెక్చర్ జ్ఞాపకమొచ్చింది. 'ఫర్ సేకెన్ మర్ మన్' అన్న పద్యం పూర్తి చేశాడు. "మర్ మన్" అనేది సగం మానవాకారం, సగం చేపాకారం కల జీవం ... మార్గరేట్ అనే ఒక యువతి ఒక మర్మన్‌చే ఆకర్షింపబడి, అతణ్ణి పెళ్లి చేసుకొని, సముద్ర గర్భంలో జీవిస్తూ, పిల్లల్నికూడా కంటుంది.

## మిడిమిడి జ్ఞానం

ఇంగ్లీషు సరిగా రాని ఒక పెద్దమనిషి, పరీక్ష ఫస్టు క్లాసులో ప్యాసయిన ఒక విద్యార్థి తండ్రితో ఇలా అన్నాడు:

పెద్దమనిషి: (కంగ్రాట్యులేషన్స్ అనుటకు బదులుగా చాలా థేంక్సండీ, మీ వాడు ఫస్టుక్లాసులో ప్యాసయ్యాట్ట.

తండ్రి: (తెల్లబోతూ) మా వాడు ప్యాసయితే మధ్యన మీరెందుకండీ థేంక్సు చెప్తారు?

పెద్ద: (తన తప్పును తెలుసుకొని) అదికాదండీ, మీ వాడిని మా అల్లుడుగా చేసుకుందామనుకుంటున్నాము, మరి అటువంటప్పుడు మా అల్లుణ్ణి (కాబోయే) అంత కష్టపడి చదివించినందుకు మీకు థేంక్సు చెప్పాలా? వద్దా? పోనీ మీరే చెప్పండి

తండ్రి: ఓహో! అదా సంగతి. దాపరికేముంది లెండి అంతా దైవాధీనం.

వై. క్రిష్ణమూర్తి (విశాఖపట్నం)

కొన్ని సంవత్సరాల తరువాత ఒక ఈస్టర్ పండుగనాడు, చర్చికి వెళ్ళి, ప్రార్థించిరావ డానికి అనుమతిపొంది, భూమిమీది తిరిగి అడుగిడుతుంది. తిరిగి మార్గరేట్ రాదు. మర్మన్, అతని పిల్లలూ ఆమెని సంస్మరిస్తూ బాధపడటంతో కథ ముగుస్తుంది." లెక్చర్ ముగించగానే, లతి లేచి, "అయితే, మార్గరేట్ కేరక్టర్ ఎటువంటిదని వ్రాయాలి సర్?" అంటూ ప్రశ్నించింది. మధు సమాధానం చెప్పాడు..."మార్గరేట్ తనకు తానే సమ్మతించి మర్మన్‌ని చేసుకుంది. ఆమె వల్ల అతనికి పిల్లలు కలిగారు. ఆమె కర్తవ్యం ఏమిటి అప్పుడు? తన పిల్లల్నీ, భర్తనీ మామ కోవడమేకదా? తనజీవితం పాపపంకిలం అయిపోయిందని చర్చికివెళ్ళి పవిత్రగ్రంథాలు తిరగవేస్తే ఉత్తమురాలైపోతుందా?...తన జీవితంలో ఒక ముఖ్యసోపానమే నిర్వర్తించలేకపోయిందామె"...అతనికి శారద జ్ఞాపకంవచ్చింది ఈ సమయంలో. ఆ వేశంతో ముగించాడు...

"తను సుఖపడలేకపోయినా, తనవలన ఇతరులకి బాధకలిగేటట్లుమాత్రం ఎవరూ ప్రవర్తించకూడదు. ఈ దృష్ట్యా మార్గరేట్‌కి మనసానుభూతి నందించలేము ... పీరియడ్ అయిపోయినతరువాత తాను వెళ్ళి పోతూంటే, లతి నవ్వుతూ తన స్నేహితురాలితో అంటున్న మాటలు వినపడ్డాయి: "బహుశః మన మాష్టరుగారికి తన జీవిత సర్వస్వం అర్పించే భార్య దొరికివుంటుంది! చెప్పినదల్లా చేస్తూ, ఎప్పుడూ ఆయనగార్ని వదలకుండా ఉంటుంది కామోసు...అందుకనే మాష్టరుగారు 'మార్గరేట్'ని క్షమించలేకపోయారు"—

ఈ మాటలు జ్ఞాపకం రావడంతో మధు ఆవేశపూరితుడయ్యాడు...'శారద ఎలాంటిదో లతికేం తెలుసు?'...అనుకున్నాడు ఏమైనాసరే, చూస్తూ చూస్తూ తనచేతులారా జీవితం నాశనం చేసుకోలేడు ... తను ఇక శారదతో కలిసి ఉండలేడు. శారదని వాళ్ళయింటికి పంపించివేసి తను తిరిగి సంసారం ఏర్పాటుచేసుకోవాలి. ఇది తన ఆశయాలకి విరుద్ధమైనా చేయక తప్పదు. ఇవాళే ఉత్తరం వ్రాసేసెయ్యాలి మూర్తి వాళ్ళకి, శారదని వచ్చి తీసుకు వెళ్ళమని...

నిశ్చల మనస్కుడై ఇంటికి చేరుకొన్నాడు. బయట గది తెరిచేవుంది... బూట్లు విప్పుకుంటూ ఉంటే లోపలి గదిలో నుంచి ఖమాస్ రాగంలో వీణపాట వస్తోంది. ...అది అతనికి విసుగు కలిగించింది. అతనిప్పుడు సంగీతాన్ని విని ఆనందించే పరిస్థితిలో లేడు. "అబ్బ! ఏమిటీ గోల! రేడియో కట్టేసెయ్" విసుగ్గా అన్నాడు. రేడియో కట్టబడలేదు. అతనికి కోపం ఎక్కువయింది. "మనుషులకొకసారి చెప్తే అర్థం అవుతుంది

...లేదేమో కట్టమంటే నీక్కాదూ చెప్పేది?" ...లేదేమో. ఇంకా కట్టబడలేదు. మధుకి చిర్రెత్తుకోపం వచ్చేసింది. తనను తాను సంబాళించుకోలేకపోయాడు. "చెప్పేదీ కొక్కాదూ?" అంటూ అరుస్తూ లోపలికి పరుగెత్తాడు... కాని... గుమ్మం దాటిన వెంటనే ఆగిపోయాడు... అతని ముఖకవళికలు మారిపోయాయి... విసుగూ, కోపమూ బదులు సంతోషరేఖలు ప్రస్ఫుటించాయి అతనిలో... తనకళ్ళను తానే నమ్మలేక పోయాడు... అవును శారదే!... వీణ వాయిస్తోంది... ఎంత అద్భుతంగా వాయిస్తోంది! తను నిజంగా శంకరశాస్త్రి రికార్డ్ వస్తోందనుకున్నాడు... 'శారదా' అని మెల్లిగా పిలిచాడు మధు. ఇంతవరకు అతన్ని గమనించని శారద ఆ పిలుపుతో ఒక్కసారిగా మధువైపు చూసింది. వెంటనే పాట ఆపేసింది. మధు ఆమెదగ్గిరగా వెళ్ళి, "ఏం శారదా? నేను వినకూడదా, నీపాట? అని జాలిగా అడిగాడు. శారద తలవంచుకొని, 'మీకు విసుగు కలిగిస్తుందేమోనని...' అంది ... మధు చాలా బాధపడ్డూ అన్నాడు. 'ఎంత చెడ్డవాళ్ళయినా సంగీతం విని ఆనందించగల హృదయం వుంది శారదా! అయినా వినడానికైనా అర్హత వుండాలిగా!... నీకంత బాగా వీణ వచ్చని నాకు తెలియదు. అదైనా ఇప్పుడు తెలియకపోతే, నేనేం

## శారద

చేసేవాణ్ణో..." శారద భయపడుతూ అడిగింది, 'ఏంచేసేవారండీ?' అని. అప్రయత్నంగా మధు కళ్ళవెంట నీళ్లుతిరిగాయి. 'ఆ ప్రశ్నమాత్రం నన్నడగకు శారదా!' అంటూ కాళ్లుకడుక్కోడానికి వెళ్ళిపోయాడు..

భోజనం చేస్తూన్నప్పుడు, "నీకు వీణ వాయించడం వచ్చని ఎప్పుడూ చెప్పలేదే?" అన్నాడు మధు ఎంతో లాలనగా. శారద కొంచెంగా సిగ్గుపడింది. కంచంలోకి చూస్తూ అంది: "అన్నయ్య చెప్పాడేమో అనుకున్నానండీ! పెళ్ళికిముందే వీణ పాడయింది. బాగుచేయించటానికి ఇచ్చాను. ఇవాళ అన్నయ్య వచ్చినప్పుడు తీసుకొచ్చాడు". మధు ఆశ్చర్యంగా "మూర్తి వచ్చాడా ఇవాళ? ఏడీ?" అంటూ అడిగాడు. అభిమానం ఉట్టిపడింది ఆ ప్రశ్నలో. శారద ఆశ్చర్యం ప్రకటించింది: "మీ కాలేజికి రాలేదండీ? తొందరగా మళ్లీ ఊరికి వెళ్ళిపోవాలని, నేనెంత పట్టుపట్టినా ఉండకుండా వెళ్ళిపోయాడు. వెళ్ళేముందు మిమ్మల్ని కాలేజిలో కలుసుకుంటానని అన్నాడు. వీలుపడలేదేమో మరి." మధుకి బాధకలిగింది. మూర్తి కావాలనే తనను కలుసుకోకుండా వెళ్ళాడని గ్రహించాడు.

మంచంవాల్చి పక్క వేస్తున్నప్పుడు "నీవు వీణ ఎప్పుడు నేర్చుకున్నావు?" అని శారదనడిగాడు మధు. శారద చెప్పింది: "పదో యేటప్పటినుంచీ నాకు మూర్ఛలు వచ్చేవి. మనసంతా పాడవకుండా దేనిమీదైనా లగ్నంకావాలనీ, ఎప్పుడూ సంతోషంగా ఉండేటట్లు చూడాలని డాక్టర్లు చెప్పేవారు. అందుకని వీణ చెప్పించారు. ఎప్పుడూ అదే వాయించుకుంటూ కూర్చునేదాన్ని."

"మధు ఏ ధ్యాసలో ఉన్నాడో శారదవైపు చూస్తూ ఒక్కసారిగా అన్నాడు: "రేపట్నుంచి క్లబ్బుకి వెళ్ళను, శారదా! ఇంటికే నాలుగుగంటలకల్లా వచ్చేస్తాను. సాయంకాలంపూట అలా షికారుకి వెళ్తూవుందాం...రోజూ నాకోగంట వీణ నేర్పుతూ వుండు. పాడానికి కంఠం లేకపోయినా కనీసం ఉన్న అభిలాషను వాయిస్తూనయినా తీర్చుకోవచ్చు..."

శారద ఆశ్చర్యచకితురాలైపోయింది... ఇతనిలో కలిగిన మార్పును చూసి ఆమె నమ్మలేకపోతోంది. "ఇంతటి కళాత్మక హృదయమా ఇతనిది? అది తను గ్రహించలేకపోయానే?" అనుకుంది. 'తప్పుచేశానండి!' అంటూంటే ఆమెకళ్లు వికసించాయి.

శారద వంటింటిపని సవరించుకోవడానికి లోపలికి వెళ్ళిపోయింది. శారద వచ్చేదాకా ఏదైనా పుస్తకం చదువుదామని టేబిల్ దగ్గరకు వెళ్ళాడు మధు. మూర్తి వ్రాసి పెట్టిన లేఖ ఒకటి దానిమీద వుంది. ఆత్రుతగా తీసి చదువసాగాడు.

"మధూ!

నీవొకసారి నాకో పుస్తకం ప్రెజెంట్ చేస్తూ, దానిమీద - ప్రేమ్‌చంద్ వాక్యం కోటేసావు - "దాంపత్య జీవితానికి అమరానందాన్ని కలుగచేయడానికి మూలకందమైనది ఆత్మీయపరిజ్ఞానం. అదే ముఖ్యమైతే..." అంటూ ఏమేమో వ్రాశావు. జ్ఞాపకం వుందా? ఈ నిజాన్ని నీ వంతవరకు తెలుసుకున్నావో నేను గ్రహించలేక పోతున్నాను. నీగురించి మీపక్కయింటివాళ్లని ఇవాళ అడిగాను. నీవు కొన్నాళ్ళనుండి శారదను విసుగ్గానూ, కోపంగాను చూస్తున్నావని చెప్పారు. ఇదేనా నీవు దాంపత్యజీవితంలో చూపించే 'ఆత్మీయపరిజ్ఞానం?' శారద ఎప్పుడైనా నీమాటకు ఎదురుతిరిగిందా? నీవు కోపంలో అన్న ప్రతిమాటా దానిహృదయాన్నెంత బాధించిందో గ్రహించగలిగావా? నీ ప్రవర్తనే ఇలాగుంటే దాని మూర్ఛలూ అవీ ఎలా తగ్గుతాయనుకున్నావ్? మనం చదువుకొనేరోజుల్లో, 'ఏమీ బాధలనుభవించని అమ్మాయిని చేసుకొని సంసారం చేసేకంటే, ఒక వ్యథితహృదయాన్ని చేసుకొని ఆమెకు సంతోషం ప్రసాదించడంలో




గొప్పతనం వుంది. ఇదే ఆశయంగా పెట్టుకోవాలి జీవితంలో' అంటూ ఏమేమో అనేవాడివే! ఏమయ్యాయి ఆ ఆశయాలు? మనుషుల నర్థంచేసుకొని, నీ ఆశయాల నణచుకోకుండా జీవిస్తా ననుకున్నాను... కాని పొరపడ్డా ననిపిస్తోంది...

నేనే నిన్ను మోసంచేశా ననుకున్నా వట కదూ?...ఏమోమరి. నే నెంతోమంది వైణికుల్ని చూశాను. మా శారదలాగా వాయించేవారెవరూ నాకు కనపడలేదు. అటువంటికళా హృదయాన్ని నీకు అర్పించటం మోసమా? నాకు తెలిసినంతవరకూ మూర్ఛరోగాలు ఎవరినీ జీవితాంతం పీడించలేదు. దాని ప్రభావం కొన్ని సంవత్సరాలు మాత్రమే ఉంటుంది. ఆతరువాత దానంతటదే పోతుంది. ఆసమయంలోనే రోగికి ఆత్మబలం చేకూర్చాలి. మా శారదకు కరువైన ఆత్మబలం, సంతోషం నీ వివ్వగలుతా వనుకున్నాను... కాని... కాదనిపిస్తోంది...ఏంచేస్తాం? ... అనుభవించాలి......"

మధుకళ్ళలో నీళ్ళు తిరిగాయి. శారదా, మాటలను తను సరిగ్గా అర్థంచేసుకోవలేక పోయానే అని బాధతో కుమిలిపోతున్నాడతను. 'ఇక జన్మలో మీమనసుల్ని కష్టపెట్టను' అని మనస్సులో అనుకున్నాడు.

శారద చేతులు తుడుచుకుంటూ వచ్చింది. మధు ఆమెవైపు చూశాడు. ఎంతనిర్మలంగా అమాయకంగా ఉందో ఆమె!

"శారదా! నిన్నెంతగానో దుఃఖపెట్టాను కదూ?" హీనస్వరంతో అన్నాడు.

శారద కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి ఈమాటలో. ఆమెసంతోషం వర్ణనాతీతం. మధుని సముదాయిస్తూ, "ఏమిటండీ అలా అంటారు? మీ రెంతో మంచివారు కాకపోతే నాలాంటి అభాగ్యురాలికి ఆశ్రయమిస్తారా? నే నెంతో అదృష్టవంతురాలిని" అంటూ అతని చేతుల్లో వాలిపోయింది.

* * *

జీవితసాగరంలో ఒడుదుడుకులు లేని కుటుంబాలు అంటూ ఉండవు. చాలామంది వాటిని ఎదుర్కోలేరు. సాహసించి ఇటువంటి పరిస్థితులను కొనితెచ్చుకొనేవారి సంఖ్య అరుదు. ఆ కొద్దిమందికూడా తాము ఎవరికోసమైతే త్యాగానికి సిద్ధపడుతున్నారో, వారివద్దనుండి ఒక ప్రత్యేకమైన అనుభూతి పొందకపోతే, తమ జీవితాన్నే ఒక వ్యర్థమైనదిగా పరిగణించడం మొదలెట్టారు.

శారదా, మధూల విషయంలో కూడా ఇంతే జరిగింది. మధు శారదవలన పడే బాధలకి ఉపశమనం శారద వీణాగానాన్నుండి వచ్చింది. హర్షపులకితుడయ్యాడు అతను. ఆ మానవాకారంలోనే అపరశారదను దర్శనము చేసుకోగలిగాడు.

* * *

తెల్లవారుజామున నాలుగుగంటలసమయం. మధుకి మెలకువ కలిగింది. టేబుల్ లైట్ వేసి, అయిదు నిమిషాలపాటు వ్రాశాడేమిటో...మంచంమీద శారద పడుకునే వుంది. ప్రక్కగా కూర్చున్నాడు. 'ఎంత నిర్మలంగా ఉందో శారద వదనం?'... అలాగే చూస్తూ కూర్చున్నాడు. అలారం మోగింది. శారద కళ్ళు నులుముకుంటూ లేచి అలవాటుప్రకారం మంగళసూత్రం కళ్ళకద్దుకొంది. మధు ఆమెవంకే చూస్తున్నాడు ఇంకా... "అల్లా చూస్తున్నారేం? నేనేం వింతగా కనపడటం లేదుకదా?" చాలా అమాయకంగా అడిగింది...

"ఏం, చూడకూడదా?" మధు పెంకిగా అడిగాడు.

"రాత్రంతా పడుకోలేదండీ?" శారద మాటమార్చింది.

"పడుకున్నాను శారదా! ఇప్పుడే లేచాను. మూర్తికి ఉత్తరం వ్రాసి ఇలా కూర్చున్నాను" అన్నాడు.

"ఏమని వ్రాశారేమిటి?" కొద్దిగా భయపడుతూనే అడిగింది శారద.

"టేబుల్ మీదఉంది, చూడు" అన్నాడు మధు.

శారద పక్కకు చెదిరిన పమిటను సర్దుకుంటూ మంచందిగింది. టేబుల్ లైట్ వెలుతురులో ఆఉత్తరం చదువుకొంది; "మూర్తీ!...శారదంటే ఏమిటో ఇప్పుడు తెలుసుకున్నాను...ఇకనుంచి నా ప్రాణంకన్నా అధికంగా చూసుకొంటాను. ఇంతవరకు ఆమెను సరీగ్గా అర్థం చేసికోవక మిమ్మల్నందరినీ బాధపెట్టినందుకు నేనెంతో సిగ్గుపడుతున్నాను" ... శారద అమితాశ్చర్యంతో మధువైపు చూసింది.

"కాసేపు వీణ వాయిస్తావా?"...మధు అడిగాడు.

ముఖ ప్రక్షాళనం చేసుకొనివచ్చి, వీణ ముందేట్టుకొని, భూపాలం ఆలాపించింది శారద. మంచంమీద పడుకొని శారద పాట వింటున్న మధు తన్మయత్వం పొందాడా గానంతో...'ఎంత నైపుణ్యం సంపాదించిందీ?' అనుకున్నాడు.

పాట పూర్తవగానే మధు అన్నాడు; 'ఇవేళ తొందరగావచ్చి...'

"వచ్చి ఏంచేస్తారేమిటీ?" మధ్యలోనే చిలిపిగా అడిగింది శారద.

"నీ పాటకు తాళంవేస్తూ కూర్చుంటాను" అన్నాడు.

శారదముఖం హాసప్రఫుల్లమైంది. మంచంమీద కూర్చుంటూ నిజంగా "మీలాంటివాళ్ళు మానవకోటిలో..." అని ఏమో అనబోతూంటే,

"జంతుసమానులు కదూ?" అన్నాడు లేచి కూర్చుంటూ మధు.

"కాదు! దేవతా స్వరూపులండీ!" అంటూ అతని భుజం మీద వాలిపోయింది శారద ★

